# అప్పుడే రూ.900 కోట్ల బిజినెస్సా..



'హీరోలం మేమంతా బాగానే ఉంటాం.. మీరు కూడా బాగుండాలి' అని స్టార్ హీరోలు ఎంత చెప్పినా ఫ్యాన్స్ మాత్రం మారడం లేదు. ఎప్పటికప్పుడు సోషల్‌మీడియాలో ఫ్యాన్ వార్ చేస్తూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నారు. ఫలానా హీరో సినిమా రిలీజైతే నెగిటివ్ వార్తలు ప్రచారం చేసి చేయాల్సిన నష్టమంతా చేస్తున్నారు. మళ్లీ తమ హీరో సినిమా వచ్చేటప్పటికి యాంటీ ఫ్యాన్స్ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఏడుస్తుంటారు. తెలుగులో టాప్ హీరోల ఫ్యాన్స్ అందరి పరిస్థితి ఇలాగే ఉంది. ఇలాంటి పనుల వల్ల అంతిమంగా సినీ ఇండస్ట్రీకి నష్టం కలుగుతోం దన్న సోయి వాళ్లకు లేకుండా పోతోంది. పవన్ కళ్యాణ్ నటించిన 'ఓజీ' విషయంలో ఇలాగే జరిగింది. ఈ చిత్రం అస్సలు బాగోలేదని, కలెక్షన్లు దారుణంగా పడిపోయాయని, బయ్యర్లు రూ.40 కోట్ల వరకు నష్టపోతున్నారని ప్రచారం చేస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బ్రేక్ ఈవెన్ కాలేదన్న మాట వాస్తవమే గానీ మరీ రూ.40 కోట్ల నష్టం అన్న ప్రచారం మాత్రం నమ్మశక్యంగా అనిపించడం లేదు. తమ హీరో చిత్రంపై జరుగుతోన్న దుష్ప్రచారం చూసి పవన్ ఫ్యాన్స్‌కి మండిపోతోంది. రేపు మీ సినిమా హీరో వస్తుంది అప్పుడు చూపిస్తాం మా తడాఖా అని వారు సవాళ్లు చేస్తున్నారు.

తాజాగా ఎన్టీఆర్, నీల్ కాంబినేషన్లో తెరకెక్కుతోన్న ' డ్రాగన్ ' చిత్రంపై సోషల్‌మీడియాలో ట్రోలింగ్ కనిపిస్తోంది. ఎన్టీఆర్ తన సినిమాలకి ఫేక్ కలెక్షన్లు వేయించుకుంటూ గొప్పలు చెప్పుకుంటాడని, ఈసారి మాత్రం అలాంటి తప్పులు జరగకుండా తాము బండారం బట్టబయలు చేస్తామని కొందరు నెటిజన్లు ట్వీట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్ర విషయంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ వేసుకునే లెక్కలంటూ ఓ ట్వీట్ వైరల్ అవుతోంది. దాని ప్రకారం ఈ చిత్రానికి ఏకంగా రూ.900 కోట్ల బిజినెస్ జరుగుతోందని ఎద్దేవా చేస్తున్నారు. ఆ ట్వీట్ ప్రకారం.. ఆడియో రైట్స్ రూ.49 కోట్లు, ఓవర్సీస్ రైట్స్ రూ.51 కోట్లు, తెలుగు హక్కులు రూ.150 కోట్లు, హిందీ రైట్స్ రూ.300 కోట్లు, డిజిటల్ రైట్స్ రూ.250 కోట్లు, శాటిలైట్ రైట్స్ రూ.100 కోట్లు అమ్ముడుపోనున్నాయని, మొత్తంగా చూసుకుంట ఈ మూవీకి రూ.900 కోట్ల బిజినెస్ జరుగుతోందని తెలిపారు. ఈ ట్వీట్‌ని ఎన్టీఆర్‌పై వెటకారంగా వేశారని స్పష్టంగా తెలుస్తుండటంతో యాంటీ ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'దేవర' విషయంలోనూ ఇలా ఫేక్ కలెక్షన్లతో మోసం చేయాలని ప్రయత్నించి దొరికిపోయారని, ఇప్పుడు కొత్త సినిమా విషయంలోనూ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఎన్టీఆర్ కాలర్ ఎగరేసినా 'వార్ 2' ఎవరూ చూడలేదని, ఎన్టీఆర్‌ని నమ్మి యష్ రాజ్ ఫిల్మ్స్, నాగవంశీ సుమారు రూ.350 కోట్లు నష్టపోయారని, ఇప్పుడు 'డ్రాగన్' విషయంలోనూ అంతేనని అంటున్నారు.

# కొత్త సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్..



విజయ్ దేవరకొండ, రష్మిక మందన ఎంగేజ్మెంట్ చేస్తున్నారనే వార్త ప్రస్తుతం మీడియాలో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నడుస్తుంది. గత కొన్నేళ్లుగా రిలేషన్‌లో ఉన్న ఈ జంట.. శుక్రవారం సీక్రెట్‌గా నిశ్చితార్థం చేసుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇప్పటికైతే ఇటు విజయ్ కానీ, అటు రష్మిక కానీ ఈ వార్తలపై స్పందించలేదు. అభిమానులు మాత్రం వీరి ఎంగేజ్మెంట్ ఫోటోలు ఏమైనా దొరుకుతాయేమో అని నెట్టింట తెగ వెతుకున్నారు. విజయ్ తో రష్మిక పెళ్లి వార్తలు వైరల్ అవుతున్న తరుణంలో, ఆమె కొత్త సినిమా విడుదల తేదీని ప్రకటించారు.

రష్మిక మందన ప్రధాన పాత్రలో 'ది గర్ల్‌ఫ్రెండ్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో 'దసరా' ఫేమ్ దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, సాంగ్స్ ఆకట్టుకున్నాయి. అయితే చాలా కాలంగా వార్తల్లోనే ఉంటున్న ఈ సినిమా.. ఎప్పుడు రిలీజ్ చేస్తారనేది క్లారిటీ లేకుండా పోయింది. తాజాగా చిత్ర బృందం విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. ఓ ఇంట్రెస్టింగ్ అనౌన్స్ మెంట్ వీడియో ద్వారా డేట్ వెల్లడించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాన్ని నవంబర్ 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. మీరు ఏ టైప్? అంటూ సినిమా కాన్సెప్ట్ గురించి హింట్ ఇచ్చారు. "అబ్బాయిలు, అమ్మాయిలు, స్త్రీలు, పురుషులు... మీరు ఎప్పుడైనా ఒక రిలేషన్ లో ఉంటే... లేదా భవిష్యత్తులో రిలేషన్ లో ఉండటాలనుకుంటే... మా సినిమా నుండి మీకు చాలా ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయని నేను భావిస్తున్నాను. ఇది ఒక ఇంటిమేట్ ఇంటెన్స్ రిలేషన్ షిప్ డ్రామా... ఎటువంటి లెక్చరర్స్ ఉండవు.... ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత కథ మాత్రమే ఉంటుంది. మీ టైప్ ఎవరు అనే దానిపై మీరు నిర్ణయం తీసుకుంటారు. ఈ రిలీజ్ డేట్ ప్రోమోను తప్పకుండా చూడండి" అని డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ పేర్కొన్నారు.

# 'వార్ 2' రిజల్ట్‌పై హృతిక్ రోషన్ పోస్ట్..



జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యష్ రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ లో భాగంగా ఈ చిత్రం తెరకెక్కింది. భారీ అంచనాలతో ఆగస్టు 14న విడుదలైన ఈ మూవీకి మిశ్రమ స్పందన లభించింది. అంచనాలను అందుకోవడంలో ఫెయిల్ అయింది. కలెక్షన్స్ కూడా టాక్ కు తగ్గట్టుగానే వచ్చాయి. తాజాగా 'వార్ 2' రిజల్ట్ పై హృతిక్ స్పందించారు. సోషల్ మీడియాలో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు.

"కబీర్ పాత్ర పోషించడం చాలా సరదాగా అనిపించింది. ఆ పాత్ర గురించి బాగా తెలుసు కాబట్టి చాలా రిలాక్స్ గా ఉన్నాను. అది నాకు సులభంగా అనిపించింది. నేను ఎవరికైనా చెప్పేది ఏంటంటే, దేన్నైనా తేలికగా తీసుకోండి. ఒక యాక్టర్ గా సినిమాలో బాగా నటించండి.. మీ పని చేసుకొని ఇంటికి రండి. ఈ సినిమా విషయంలోనూ నేను సరిగ్గా అలాగే చేశాను. నా దర్శకుడు అయాన్ ముఖర్జీ నన్ను చాలా బాగా చూసుకున్నాడు. సెట్‌లో అతని ఎనర్జీ నాలో ఉత్సాహం నింపింది" (2025లో 250 కోట్ల క్లబ్‌లో చేరిన టాప్-10 సినిమాలు ఇవే.. 'వార్ 2' ఏ స్థానంలో ఉందంటే..

"ప్రతిదీ చాలా పర్ఫెక్ట్ గా అనిపించింది. ఎక్కడా రాజీ పడకుండా చేశాం. ఖచ్చితంగా విజయం సాధిస్తుందని అనుకున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా నా పనిని నేను సరిగ్గా చేయాలని అనుకున్నాను.. అదే చేశాను కూడా. సినిమాలో నటిస్తున్నప్పుడు "ఇది చాలా ఈజీ.. నాకు చాలా బాగా తెలుసు. నేను దానికి అర్హుడిని. ప్రతి సినిమాకి గాయాలయ్యేలా నిరంతరం చిత్రహింసలు పడుతూ ఉండాల్సినంత అవసరం లేదు.. జస్ట్ రిలాక్స్" అని నా మనసు చెబుతుండేది" అని హృతిక్ రోషన్ తన పోస్టులో రాసుకొచ్చారు. దీనికి 'వార్ 2' హ్యాష్ ట్యాగ్ జోడిస్తూ.. సినిమాలో కబీర్ పాత్రకు సంబంధించిన ఫోటోలను షేర్ చేశారు. అయితే ఎన్టీఆర్ గురించి కానీ, యష్ రాజ్ ఫిలిమ్స్ గురించి కానీ హృతిక్ ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం.

2019లో వచ్చిన 'వార్' చిత్రానికి సీక్వెల్ గా 'వార్ 2' రూపొందింది. ఇందులో కబీర్ అనే రా ఏజెంట్ పాత్రలో హృతిక్ రోషన్ నటిస్తే.. మేజర్ విక్రమ్ పాత్రలో ఎన్టీఆర్ నటించారు. తారక్ బాలీవుడ్ డెబ్యూ కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. కానీ సినిమా చూసిన తర్వాత డిజప్పాయింట్ అయ్యారు. ఎన్టీఆర్ - హృతిక్ సైతం ప్రీ రిలీజ్ ఈవెంట్స్ లో సినిమాపై చాలా ధీమా వ్యక్తం చేశారు.

# 'కాంతార చాప్టర్ 1'పై ఆర్జీవీ సెన్సేషనల్ ట్వీట్




కన్నడ స్టార్ రిషబ్ శెట్టి హీరోగా, దర్శకుడిగా రూపొందించిన ' కాంతార చాప్టర్ 1 ' చిత్రం భారీ అంచనాల నడుమ విజయదశమి రోజున విడుదలై సంచలనం విజయం సాధించింది. తొలి షో నుంచే పాజిటివ్ టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రం 2025లో బిగ్గెస్ట్ ఓపెనింగ్ అందుకున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది. అలాగే ఈ సినిమాకి డివైన్ బ్లాక్ బస్టర్‌గా ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. ఇక బుక్ మై షోలో రిలీజ్ రోజు సుమారు 1.28 మిలియన్‌కి పైగా టిక్కెట్లు బుక్ అయ్యయంటేనే ఈ సినిమాకి ప్రేక్షకులు ఎలా బ్రహ్మరథం పడుతున్నారో అర్థమవుతోంది. భాషా వివాదంతో తెలుగు నాట ఈ చిత్రాన్ని బాయ్‌కాట్ చేయాలని కొంతమంది పిలుపునిచ్చినా టాక్ బాగుండటంతో ఈ వివాదం పక్కకి వెళ్లిపోయింది. కంటెంట్ బాగుంటే వివాదాలు ఏం చేయలేవని ఈ చిత్రం మరోసారి నిరూపించింది.

'కాంతార చాప్టర్ 1'పై సామాన్య ప్రేక్షకులే కాదు సెలబ్రెటీలు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ చిత్రంలో రిషబ్‌శెట్టి కొత్తలోకానికి తీసుకెళ్లాడని, హీరోగానే కాకుండా దర్శకుడిగానే నూటికి నూరు మార్కులు సంపాదించాడని కొనియాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వివాదాస్పద దర్శకుడిగా ముద్రపడిన రామ్‌గోపాల్ వర్మ తాజాగా చేసిన ట్వీట్ సంచలనంగా మారింది. 'కాంతార ఒక అద్భుతం. దేశంలోని అందరు చిత్ర నిర్మాతలు రిషబ్ శెట్టి, అతడి టీమ్‌ని చూసి సిగ్గుపడాలి. కంటెంట్‌తో పాటు వారి కృషి ఈ చిత్రాన్ని బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టింది. క్రియేటివ్ టీమ్ రాజీపడకుండా సహాయ సహకారాలు అందించిన హెూంబలే ఫిల్మ్స్‌ని అభినందించి తీరాలి. రిషబ్ శెట్టి గొప్ప యాక్టరా.. గొప్ప డైరెక్టరా? అనే విషయాన్ని నేను తేల్చుకోలేకపోతున్నాను' ట్వీట్ చేశారు ఆర్జీవీ.

అయితే 'కాంతార చాప్టర్ 1' చిత్రాన్ని చూసిన ఎవరైనా రామ్‌గోపాల్ వర్మ అభిప్రాయాన్ని అంగీకరించక మానరు. సినిమాలతో అంత అద్భుతంగా నటిస్తూ అంతకంటే గొప్పగా డైరెక్షన్ చేయడం అనేది సామాన్య విషయం కాదు. గతంలో మన తెలుగులో దాసరి నారాయణరావులో అలాంటి టాలెంట్ కనిపించేది. ఇంతటి టిపికల్ డివోషనల్ స్టోరీని టేకప్ చేయడంతో పాటు హీరోగా నటించి మెప్పించడం గొప్ప విషయం. ఈ విషయంలో రిషబ్‌శెట్టి తాను అందుకుంటోన్న ప్రశంసలకు పూర్తిగా అర్హుడే. రిషబ్‌శెట్టి త్వరలోనే తెలుగులోకి నటుడిగా ఎంట్రీ ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'జై హనుమాన్'లో ఆయన ఆంజనేయుడిగా కనిపించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే పోస్టర్ రిలీజ్ చేశారు. అయితే అనుకోని అవాంతరాలతో ఆ ప్రాజెక్టు ఆలస్యమవు తోంది. మొత్తానికి ఏ విషయాన్నైనా నిర్భయంగా చెప్పే ఆర్జీవీ.. 'కాంతార చాప్టర్ 1'పై చేసిన ట్వీట్ చర్చనీయాంశమైంది.

# ప్రభాస్‌కి విలన్‌గా బాలీవుడ్ స్టార్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. ఆయన నటిస్తోన్న 'ది రాజా సాబ్' చిత్రం వచ్చే సంక్రాంతి కానుకగా జనవరి 9న రిలీజ్ కానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి సంబంధించి రాబోయే రోజుల్లో మరిన్ని అప్‌డేట్స్ ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. మరోవైపు హను రాఘవపూడితో 'ఫౌజీ' చిత్రంలో నటిస్తున్నాడు ప్రభాస్. ఈ చిత్రం కూడా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ రెండు చిత్రాల తర్వాత ప్రభాస్ నటించేంది సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్లో తెరకెక్కే ' స్పిరిట్ ' మూవీ. అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాలతో నేషనల్ వైడ్‌గా క్రేజ్ సంపాదించుకున్న సందీప్.. ప్రభాస్‌ని ఎలా చూపించబోతు న్నాడా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసిన సందీప్ విదేశాల్లో షూటింగ్ లొకేషన్లు కూడా ఫిక్స్ చేశాడని తెలుస్తోంది. తాజాగా అందుతోన్న సమాచారం ప్రకారం నవంబర్ 5 నుంచి షూటింగ్ అధికారికంగా ప్రారంభమవుతున్నట్లు సమాచారం. హై వోల్టేజ్ యాక్షన్ అండ్ ఎమోషన్ థ్రిల్లర్‌గా తెరకెక్కే ఈ చిత్రానికి సంబంధించి వచ్చే ప్రతి అప్‌డేట్ ప్రభాస్ ఫ్యాన్స్‌కి కిక్కిస్తోంది.



ఈ చిత్రంలో హీరోయిన్‌గా ముందు బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణేని తీసుకున్న సందీప్.. ఆమె పెట్టే కండిషన్లకు చిర్రెత్తుకొచ్చి తీసిపారేసి ఆమె స్థానంలో త్రిప్తి దిమ్రిని తీసుకున్నాడు. ఈ చిత్రంలో మలయాళ భామ మడొన్నా సెబాస్టియన్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించే ప్రభాస్‌కి తండ్రిగా మెగాస్టార్ చిరంజీవి నటించబోతు న్నారన్న వార్త తెగ హల్‌చల్ చేస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మరో అదిరిపోయే అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది.

ఈ మూవీలో బాలీవుడ్ హీరో వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటించను న్నాడట. హీరోగా ఎన్ని చిత్రాలతో మెప్పించిన వివేక్ ఒబెరాయ్ ఇప్పటికే కొన్ని సినిమాల్లో విలన్‌గా నటించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్‌లో 'క్రిష్ 3, కోలీవుడ్‌లో 'వివేకం' చిత్రాల్లో ప్రతినాయకుడిగా నటించిన ఆయన తెలుగులో రామ్‌చరణ్, బోయపాటి కాంబినేషన్లో తెరకెక్కిన 'వినయ విధేయ రామ' చిత్రంలో విలన్‌గా నటించాడు ఈ చిత్రం డిజాస్టర్ కావడంతో వివేక్‌కి తెలుగు మేకర్స్ ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా ప్రభాస్‌కి విలన్‌గా ఆయన్ని రంగంలోకి దించేందుకు సందీప్ ప్లాన్ చేస్తున్నాడని తెలియడంతో ఈ వార్త హల్‌చల్ చేస్తోంది. ఇందులో ప్రతి సీన్ గూస్‌బంప్స్ వచ్చేలా, ఇప్పటి వరకు ఎవరూ చూపించని విధంగా ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్ ఉండేలా సందీప్ రెడ్డి జాగ్రత్తలు తీసుకుంటున్నాడట.

# ఫన్నీ టైటిల్‌పై కన్నేసిన మాస్ మహరాజ్



మాస్ మహరాజ్ రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.. అషికా రంగనాథ్, కేతిక శర్మ కథానాయికలు. దీనికి ' అనార్కలి ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి బరిలో దించేందుకు మేకరర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి సీజన్‌లో ఇప్పటికే చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు', ప్రభాస్ 'ది రాజా సాబ్', నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఓ రాజు' చిత్రాలు కర్చీఫ్ వేయగా రవితేజ కూడా 'అనార్కలి'లో రంగంలోకి దిగినున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే జనవరి 13న రిలీజ్ డేట్ లాక్ చేసినట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. అక్టోబర్ నాటికి షూటింగ్ పూర్తిచేసి వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెట్టి జనవరిలో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారట.

అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ అప్‌డేట్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచి దీని 'టైటిల్' అనార్కలి అనే ప్రచారంలో ఉంది. అయితే తాజాగా దీని టైటిల్ మార్చబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే ఫన్నీ టైటిల్ ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. జనరల్‌గా మైక్ అనౌన్స్‌మెంట్‌లో 'భక్త మహాశయులకు విజ్ఞప్తి' అన్నది ఎక్కువగా అంటుంటారు. ఈ చిత్రం భర్తల కాన్సెప్ట్‌తో తెరకెక్కుబోతుంది కాబట్టి ఇలా మారిస్తే క్యాచీగ ఉంటుందని మేకర్స్ అనుకుంటున్నారు. దీనిపై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశముంది. ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. గ్లింప్స్ దసరాకి విడుదల చేయాలని అనుకున్నా సాధ్యం కాలేదు. దీపావళికి ఫస్ట్ లుక్ విడుదల చేసి రిలీజ్ వరకు వరుస అప్‌డేట్స్ ఇవ్వాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం రవితేజ చేతిలో 'మాస్ జాతర' సినిమా ఉంది. అది ఈ నెల 31న విడుదల కానుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రం ఎన్నోసార్లు వాయిదా పడుతూ చివరికి అక్టోబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో రవితేజకి జోడీగా శ్రీలీల నటించింది. వీరిద్దరు కలిసి నటించిన 'ధమాకా' సూపర్‌హిట్ గా నిలవడంతో తాజా చిత్రంపై మంచి అంచనాలే ఉన్నాయి. ఈ సినిమా విడుదల తర్వాతే దర్శకుడు కిశోర్ ప్రమోషన్లు మొదలుపెడతారని తెలిసింది. ఇటీవల కాలంలో సరైన హిట్ లేక సతమతమవు తోన్న రవితేజకి ఈ రెండు చిత్రాలు కీలకం కానున్నాయి.

# నెల రోజులకే ఓటీటీలోకి...



తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఫాంటసీ అడ్వెంచర్ చిత్రంగా వచ్చిన 'మిరాయ్' ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న సంగతి తెలిసిందే. థియేటర్లలో బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. జియో హాట్‌స్టార్ వేదికగా అక్టోబర్ 10 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని సదరు ఓటీటీ సంస్థ వెల్లడించింది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకులు దీన్ని వీక్షించవచ్చు.

'మిరాయ్' కథలో పురాణ గాథలు, దైవశక్తులు, ఆధునిక సాహసాలు కలిసిన ప్రత్యేకమైన కాన్సెప్ట్‌ను దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఆకట్టుకునే విధంగా తెరకెక్కించారు. సామ్రాట్ అశోక్ కాలం నాటి దైవశక్తి, తొమ్మిది గ్రంథాలు, వాటి రక్షకులు, మానవ లోభం మధ్య జరిగే యుద్ధం ఈ కథకు ప్రధాన ఆకర్షణ. మంచు మనోజ్ మహావీర్ లామా పాత్రలో అద్భుతంగా నటించి ప్రశంసలు అందుకున్నాడు. మరోవైపు హీరో తేజ సజ్జా తన ఎనర్జీ, ఎమోషనల్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నాడు. "హనుమాన్" తర్వాత పాన్ ఇండియా స్టార్‌గా ఆవిర్భవించిన తేజ.. ఈ సినిమాతో తన స్థాయిని మరింత పెంచుకున్నాడు. యాక్షన్ సీన్స్, విజువల్ గ్రాఫిక్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకు హైలైట్‌గా నిలిచాయి. ప్రత్యేకంగా సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డిజైన్ స్థాయిని చూసి ప్రేక్షకులు హాలీవుడ్ రేంజ్‌లో ఉందని కామెంట్లు చేశారు. థియేట్రికల్ రన్‌లో ఈ చిత్రం రూ.150 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించిన ఈ చిత్రం 2025లో టాలీవుడ్ టాప్ కలెక్షన్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. సెప్టెంబర్ 12న రిలీజైన ఈ చిత్రం మూడు వారాల థియేట్రికల్ రన్ పూర్తయినా ఇప్పటికీ చాలా ఏరియాల్లో స్ట్రాంగ్‌గా నడుస్తోంది. అయితే ఇంత మంచి హిట్ సాధించిన ఈ చిత్రం నెల రోజులు తిరగకముందే ఓటీటీలోకి వస్తుండటం నిజంగా షాకింగ్ న్యూస్ అనే చెప్పాలి. అయితే ఓటీటీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఓటీటీలో రిలీజ్ చేయకతప్పని పరిస్థితులు నెలకొన్నాయి. థియేటర్లలో దుమ్మురేపిన ఈ చిత్రం ఓటీటీలోనూ అదే మ్యాజిక్ రిపీట్ చేస్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644. Web: shenarthimedia.in, Epaper:epaper.shenarthimedia.in